సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 12 । అక్టోబర్ । 2023



ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

ప్రజల ఆరోగ్య సంరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. 9లో



వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం దేవస్థానంలో స్వామివారి నిత్య కల్యాణం బుధవరం ఘనంగా నిర్వహించారు.



నేడు సహస్ర తులసీ దళార్చన

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఉదయం సహస్ర తులసీ దళార్చన జరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు జి.మాడుగులలో జగనన్నకు చెబుదాం

- పాడేరు ఐటీడీఏ స్పందన రద్దు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఈనెల 13వ తేదీ శుక్రవారం జి.మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.జి.మాడుగుల మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 2గంటల తరువాత అధికారులు తమ శాఖల సిబ్బందితో సమావేశాలు నిర్వహించి వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఐటీడీఏకు రావద్దు

పాడేరు ఐటీడీఏలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రజలు గమనించి, పాడేరు ఐటీడీఏ స్పందనకు రావొద్దని ఆయన సూచించారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

కొయ్యూరు: మండలంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్‌కు తరచూ అంతరాయం కలగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదొక చోట బీఎస్ఎన్ఎల్ కేబుల్ కట్ అవడంతో సిగ్నల అందని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించడంలో ఆ సంస్థ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్రాండ్ బాండ్ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల సమస్యలు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మత్స్యకార సంఘాలకు చేప పిల్లల పంపిణీ

రాజవొమ్మంగి: ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన ద్వారా మండలంలోని ఐదు మత్స్యకార సంఘాలకు 40 రాయితీపై 36,900 చేపపిల్లలను బుధవారం పంపిణీ చేశామని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్. రమేష్ తెలిపారు. 80 నుంచి 100 ఎంఎం పరిమాణం గల కట్ల, రోహు, మృగాల రకం చేప పిల్లలను అందజేసినట్టు ఆయన తెలిపారు. ఆక్సిజన్ నింపిన కంటైనర్లలతో తీసుకొని వచ్చిన చేపపిల్లలను మత్సకార సంఘ సభ్యులతో కలసి వట్టిగెడ్డ, గింజర్తి, సింగంపల్లి, కొండలింగంపర్తి రిజర్వాయర్లు, ఉర్లాకులపాడులోని మైనర్ ఇరిగేషన్ చెరువులో వదిలిపెట్టామని ఆయన తెలిపారు. మత్సశాఖ సహాయకులు సాయి, సత్యవతి, మత్స్యకారులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన



అర్చరీ క్రీడాకారుడు బైరాగినాయుడును అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: గోవాలో ఈనెల 24నుంచి జరగనున్న 37వ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైన గిరిజన క్రీడాకారుడు జి.బైరాగినాయుడును కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం అభినందించారు. పాడేరు మండలం సుండ్రుపుట్టు గ్రామానికి చెందిన అతనిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్మోహనరావు,కోచ్ ఎ.సుధాకర్‌నాయుడు కలెక్టర్‌కు పరిచయం చేశారు. గోవాలో జరిగే జాతీయ స్థాయి అర్చరీ క్రీడా పోటీలకు ఇండియన్ రౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో ఆంధ్రా తరపున అర్హత సాధించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. జాతీయ అర్చరీ పోటీలలో బైరాగినాయుడు సత్తా చాటి బంగారుపతకం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

టూరిజం కార్మికుల సమ్మె నోటీసు

అనంతగిరి: జిల్లాలోని పర్యాటకశాఖ ఆరు యూనిట్లలో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా మండలంలోని బొర్రాగుహలు, తైడ, అనంతగిరి యూనిట్ల మేనేజర్లకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, దినసరి ఉద్యోగులు సంఘ ప్రతినిధి నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నోటీసు అందజేశారు.అరకులోయ మండలం పున్నమి, మయూరి, చింతపల్లి మండలం లంబసింగి యూనిట్ల మేనేజర్లకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు, బాబూరావు, అంజలిరావు ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు.

నూతన ఒరవడి



ట్యాబ్‌లు చూపుతున్న విద్యార్థులు

విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడులను బలోపేతం చేస్తోంది. పేద కుటుంబాల విద్యార్థులు సైతం అంతర్జాతీయ అవకాశాలు అందుకునేందుకు అవసరమైన బోధనకు ప్రణాళికాపరంగా చర్యలు తీసుకుంటోంది. పాఠశాలలకు నాడు–నేడు నిధులతో ఆధునిక సొబగులు అద్దుతూ డిజిటల్ బోధన దిశగా అడుగులు వేస్తోంది.

- విద్యాబోధనలో సాంకేతిక విప్లవం
- పాఠశాలల్లో డిజిటల్ బోధన
- బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌ల అందజేత
- జిల్లాలో 13,848 మంది విద్యార్థులకు పంపిణీ

అరకులోయ టౌన్: కార్పొరేట్ స్కూళ్లలో కూడా అందించలేని బోధనను రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చెంతకు తెచ్చింది. దీనిలో భాగంగానే విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను అందజేసి డిజిటల్ బోధనను ప్రోత్సహిస్తోంది. గత ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయడం ద్వారా డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది మళ్లీ అదే తరగతి విద్యార్థులకు కొత్తగా ట్యాబ్‌ల పంపిణీకి చర్యలు చేపట్టింది. విద్యార్థులు డిజిటల్ విద్యను మరింత సమర్థవంతంగా అభ్యసించేలా ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తోంది. విద్యార్థులు ఇంటికి వెళ్లిన తరువాత కూడ ట్యాబ్‌లను చూసి పాఠ్యాంశాలను రివిజన్ చేసుకునే వెసులుబాటు ఉంది.

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో తొలుత 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని గతేడాది డిసెంబర్ 21న ప్రారంభించింది. జిల్లాలోని 315 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదవుతున్న 13,848 మంది విద్యార్థులకు ఒక్కో ట్యాబ్‌ను ప్రభుత్వం అందజేసింది. ఆయా తరగతులను బోధించే సబ్జెక్టు టీచర్లు 2,193 మందికి కూడ ఒక్కో ట్యాబ్ అందజేసింది. వీటి సాయంతో ఉపాధ్యాయులు 9వ తరగతికి వచ్చిన విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది 15వేల ట్యాబ్‌ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని, నవంబర్ నెలాఖరుకు పంపిణీ చేస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు..

పాఠశాల సమీపంలో ఉన్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు ట్యాబ్‌ల వినియోగంపై పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. విద్యార్థి ఉపాధ్యాయుల ట్యాబ్‌లకు సంబంధించిన భౌతిక, సాంకేతిక సమస్యలను వారు తక్షణమే పరిష్కరిస్తారు. వారానికి కనీసం ఒకసారి పాఠశాలకు నేరుగా వెళ్లి పరిశీలిస్తారు. ఈ మేరకు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు జిల్లా నోడల్ పర్సన్ రేగం కామరాజు శిక్షణ ఇచ్చారు.
- ఎస్‌డీ కార్డు అనుసంధానం చేసిన ట్యాబ్‌తో పాటు విద్యార్థికి క్యూఆర్ కోడ్ ఉన్న కాగితం ఇస్తారు. క్యూఆర్ కోడ్‌ను భద్రపరచుకోవాలి. క్యూఆర్ కోడ్‌ను విద్యార్థి పోగొట్టుకుంటే ప్రధానోపాధ్యాయుడి వద్ద ఉన్న గూగుల్ లింక్ ద్వారా తిరిగి పొందవచ్చు.

ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ..

ట్యాబ్‌ల సద్వినియోగంపై జిల్లా స్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ బృందాన్ని నియమించింది. మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులకు ట్యాబ్ సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ సమస్యలపై జిల్లా నోడల్ పర్సన్‌తో శిక్షణ ఇప్పించింది. వీరంతా సంబంధిత మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థుల ట్యాబ్‌లను తొలుత పరిశీలిస్తారు. విద్యార్థి .బోధనకు అవసరమైన వైఫై మెసేజర్, బైజూస్ కంటెంట్, డిక్షనరీ మాత్రమే ట్యాబ్‌లో ఉండే విధంగా ఇన్‌స్టాల్ చేస్తారు. విద్యకు సంబంధించినవి కాకుండా అదనంగా ఎలాంటి యాప్‌లను విద్యార్థులు ఇన్‌స్టాల్ చేయడానికి వీల్లేదు. రీసెట్ చేసిన ప్రతీ సారి సంబంధిత ఉపాధ్యాయుడికి ఓటీపీ వచ్చేలా రూపకల్పన చేశారు.





ట్యాబ్‌లోనే పరీక్ష రాసేలా అవగాహన



ట్యాబ్‌లోనే పిల్లలు టెస్టులు రాసేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. శతశాతం ట్యాబ్‌ల వినియోగానికి విద్యారుల తల్లిదండ్రులు సహకరించాలి. విద్యార్థి ఇంటి వద్ద ట్యాబ్‌ల ద్వారా చేస్తున్న రివిజన్ పరిశీలించాలి. ఉన్నత విద్యకు ఉపయోగపడే బేసిక్స్ నుంచి కంటెంటను బైజూస్ ట్యాబ్‌లలో నిక్షిప్తం చేశారు. ఈ విధానం విద్యార్థులకు బాగా ఉపయోగకరంగా ఉంటుంది. సబ్జెక్ట్ టీచర్లు మరింత దృష్టి పెట్టడానికి శిక్షణ కూడ ఇచ్చాం.

– రేగం కామరాజు, నోడల్ పర్సన్, పాడేరు

బోధన పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హెచ్చరిక



విద్యార్థులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: విద్యాబోధనలో నిర్లక్ష్యంగా చేస్తే చర్యలు తప్పవని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హెచ్చరించారు. మండలంలోని నందివలస గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు.విద్యాబోధన, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోపాటు విద్యార్థులు ఒక్క ప్రశ్నకు సమాధానాలు చెప్పకపోవడంతో ఆయన ఆగ్రహానికి గురయ్యారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో పాఠశాలలో ఏర్పాటుచేయాలని ఏడాది క్రితం ఆదేశించినా ఎందుకు పెట్టలేదని, పాఠ్య ప్రణాళిక ఎందుకు తయారుచేయలేదని హెచ్చరించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే చెప్పారు.

భూముల రీసర్వే వేగవంతం చేయండి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం జిల్లాలోని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూరీ సర్వే వేగవంతానికి సబ్ కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, వారిలో లాగిన్‌లో పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. పెండింగ్ పనులను రానున్న ఐదు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. పాడేరు డివిజన్‌లోని 30 గ్రామాల్లో రీసర్వే వీఆర్వో లాగిన్‌లో పెండింగ్‌లో ఉందన్నారు. వీటిలో సోమవారం నాటికి తహసీల్దార్ లాగిన్‌కు పంపాలని వాటిలో కనీసం 14 గ్రామాల వివరాలను సబ్‌కలెక్టర్ లాగిన్‌కు పంపాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఫారం 4, 8లను పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణపత్రాల జారీలో తాత్సారం వహిస్తున్న తహసీల్దార్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ మెంబర్, ఇన్‌కం, ఇంటిగ్రేటెడ్ ధ్రువీకరణపత్రాల జారీలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధిత సబ్‌కలెక్టర్లు బాధ్యత వహించాలని ఆదేశించారు.లేట్‌బర్త్ రిజిస్ట్రేషన్లపై కూడా చర్యలు తీసుకొని త్వరగా ధ్రువీకరణపత్రాలు జారీ చేయాలని సూచించారు. వచ్చే సోమవారం నాటికి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో కూడా అప్డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీరో డోర్ నంబర్, ఒకే ఇంటిలో పదిమంది కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సవరించాలని ఆదేశించారు. ఫారం 7, 8లను వినియోగించి తగు విచారణ జరిపి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ రామ్మోహన్, ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభంబన్సాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరివ్వడమే లక్ష్యం



కుళాయి పనులకు భూమి పూజ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- దృష్టి సారించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని ,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.43 లక్షలతో గుడివాడ మెట్ట వీధిలో చేపట్టనున్న ఇంటింటికి కుళాయిల నిర్మాణ పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడివాడ మెట్ట వీధిలోని ట్యాంకులకు కొత్త బోర్ల ద్వారా రోజుకు 1.5 లక్షల లీటర్ల సురక్షిత తాగునీటిని మళ్లించి,అక్కడ నుంచి 650 నివాస గృహాలకు నిరంతరం తాగునీరు అందించే లక్ష్యంగా కుళాయిలు నిర్మిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ఉన్న వీధులను గుర్తించి, అక్కడ కూడా ఇంటింటికి కుళాయిల వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని ఆమె పేర్కొన్నారు. వచ్చే వేసవి నాటికి తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. గతంలో తనకు గుడివాడ మహిళలు తాగునీటి సమస్యను చెప్పడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటికి కుళాయిల నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, నివాసాల్లోని ప్రజలంతా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇంటింటికి కుళాయి వ్యవస్థ అందుబాటులోకి రాగానే వాటర్ అండ్ శానిటేషన్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.తాగునీటి పథకం,కుళాయి వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ లీలాకృష్ణ, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఎంపీటీసీలు చల్లా చిట్టమ్మ,నరసింహమూర్తి,డీఈఈ ప్రకాశ్,ఏఈఈ విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సర్పంచ్ వంతాల రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గం



విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులు

సాక్షి,పాడేరు: ఏపీ విద్యుత్ ఉద్యోగుల పాడేరు డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో జరిగింది. ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 డిస్కమ్ అధ్యక్షుడు బి.గుర్నాథరావు, ఇతర విశాఖ ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమక్షంలో పాడేరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాడేరు డివిజన్ అధ్యక్షుడిగా పి.సింహాచలం, కార్యదర్శిగా పి.సంజీవరావు, కోశాధికారిగా డి. శ్రీనివాసరావు, కార్యాలయం కార్యదర్శిగా ఎం.మనీషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సి.హెచ్.వి.రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎల్.వి.ఎం.ఎస్.రావు, మరికొంతమంది ఉద్యోగులు ఎన్నికయ్యారు.

బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న డిప్యూటీ మాస్ మీడియా అధికారి రవికుమార్

సాక్షి,పాడేరు: బాలికల సంరక్షణ సామాజిక బాధ్యతగా సమాజంలో ప్రతి ఒక్కరు తీసుకోవాలని డీఎంహెచ్ కార్యాలయం జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రవికుమార్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ బాలికల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ సీహెచ్ రమాదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు చదువును మధ్యలో మానేయకుండా ఉన్నత లక్ష్యాన్ని నిర్మించుకోవాలని సూచించారు. బాలికల్లో అక్షరాస్యత పెంచేందుకు ప్రభుత్వాలు ఎంతో శ్రమిస్తున్నాయన్నారు. ఉచితంగా అన్ని సౌకర్యాలు అందిస్తూ ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నాయన్నారు. బాలికలు చిన్నవయసులో వివాహలకు దూరంగా ఉండాలన్నారు. చదువులు, ఉన్నత ఉద్యోగాల తర్వాత వివాహలు చేసుకోవడం మంచిదన్నారు. జిల్లా వృత్తివిద్యాశాఖాదికారి అప్పలరామం, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో హెలిప్యాడ్‌తో ఇబ్బందులు

తొలగింపునకు వినతి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

చింతూరు: స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో గతంలో నిర్మించిన హెలిప్యాడ్‌ను తొలగించాలని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి వేకా రాజ్‌కుమార్ మాట్లాడుతూ హెలిప్యాడ్ క్రీడామైదానం మధ్యలో ఉన్నందున ఆటలకు ఆటంకం కలగడంతో పాటు విద్యార్థులు గాయాలవుతున్నారని తెలిపారు. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హెలిప్యాడ్ తొలగించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్యామల మురళి, శేఖర్, అర్జున్, కోటి, రాజు పాల్గొన్నారు.

9,640 ఓటింగ్ యంత్రాలు సిద్ధం

కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశానికి హాజరైన అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులు

సాక్షి, పాడేరు: జిల్లాకు 9,640 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర పరికరాలు వచ్చాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలను పాడేరు డిగ్రీ కళాశాల సమీపంలో కటుదిట్టమైన భద్రత మధ్య గొడౌన్‌లో భద్రపరిచామన్నారు. 3700 బ్యాలెట్ యూనిట్లు 2640 కంట్రోల్ యూనిట్లు, 3100 వీవీప్యాట్లు వచ్చాయని చెప్పారు. అన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. వీటిలో 36 సక్రమంగా పని చేయడం లేదన్నారు. ఈనెల 16న మరొకసారి పరిశీలిస్తామని, రాజకీయపార్టీల నేతలు పాల్గొనవచ్చన్నారు. ఈవీఎం ఓటింగ్ యంత్రాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 1008 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా 13 ఏర్పాటు కావడంతో 1021కు పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగిందన్నారు. వీటి పరిధిలో 3,54,2245 మంది పురుషులు, 3,80,213 మంది మహిళా ఓటర్లు, 34 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. 40 వేల మంది శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, 24వేల మృతి చెందిన ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డీఆర్వో పి.అంబేద్కర్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా నీలగిరి చెట్ల తొలగింపు

అడ్డుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు



నరికిన నీలగిరి చెట్లు



చెట్ల నరికివేతను అడ్డుకున్న ప్రజాప్రతినిధులు

పెదబయలు: స్థానిక జెడ్పీ అతిథి గృహం ఆవరణలో నీలగిరి చెట్ల నరికివేత వివాదాస్పదంగా మారింది. మండల కేంద్రంలోని జెడ్పీ శిథిల అతిథి గృహం ఆవరణలో సుమారు 20 వరకు భారీ యూకలిప్టస్ చెట్లు ఉన్నాయి. వీటిని బుధవారం మిషన్‌తో కట్ చేసి తొలగించడాన్ని స్థానిక ఎంపీటీసీ బొంజుబాబు, వార్డు సభ్యుడు అడ్డుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని వారు ఇన్‌చార్జి ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. మండల పరిషత్ సిబ్బంది అక్కడికి చేరుకుని చెట్ల నరికవేతను నిలిపివేయించారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణయ్యను వివరణ కోరగా జెడ్పీ అతిథి గృహం ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అందువల్ల ఇదే ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించాల్సి ఉందన్నారు. ఇందుకు అనుమతి కోరుతూ జెడ్పీ సీఈవోకు నివేదిక పంపగా అనుమతి రావాల్సి ఉందన్నారు. అయితే చెట్ల తొలగింపునకు అటవీశాఖ అనుమతి ఉందని తెలిపారు. ఇలావుండగా అనుమతి లేకుండా టెండర్లు పిలవకుండా, రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీటీసీ బొంజుబాబు, వార్డు సభ్యుడు జీవన్‌కుమార్ కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యానగరం ఆశ్రమ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చింతూరు: కాకినాడలో బుధవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అథ్లెటిక్ విభాగంలో మండలంలోని విద్యానగరం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జావెలిన్ త్రో అండర్–17 విభాగంలో సీతారాం మొదటి స్థానం, షాట్‌పుట్ అండర్–14 విభాగంలో కణితి వెంకటేష్ తృతీయస్థానం, అండర్–17 విభాగంలో మడకం రాజు తృతీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు వీరికి శిక్షణనిచ్చిన పీఈటీ వెంకటేష్‌ను ఏటీడబ్ల్యూవో కంచర్ల సుజాత, ప్రధానోపాధ్యాయుడు చినబాబు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మల్కాపురం(విశాఖ): నైపుణ్య శిక్షణ కోసం హెచ్‌పీసీఎల్ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌డీఐ) దరఖాస్తులను ఆహ్వానిస్తునట్టు ఎస్‌డీఐ సీనియర్ మేనేజర్ పల్లి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండ్రస్ట్రియల్ వెల్డర్, పైప్ ఫిట్టర్, ఫైర్ అండ్ సేఫ్టీ, ఫ్యాబ్రికేషన్, ఆర్క్ వెల్డింగ్, రిటైల్ సేల్స్ అసోసియేట్, ఆఫీస్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ, డిగ్రీ వరకు చదువుకున్న 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని, అభ్యర్థులు 781336432, 9652871144లో సంప్రదించాలని సూచించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మళ్లీ కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు పైపులు

గంగవరం: మండలకేంద్రం గంగవరం సమీపంలో కుసుమరాయి కాలవ వద్ద తాత్కాలిక ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు పైపులు మళ్లీ కొట్టుకుపోయాయి. దీంతో గంగవరం- రంపచోడవరం ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కుసుమరాయి వంతెన వద్ద కొండ కాలువ జోరుగా ప్రవహిస్తోంది. ఈ ప్రవాహానికి జాతీయ రహదారి డైవర్షన్ కల్వర్టు రాత్రి కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంపచోడవరం నుంచి అడ్డతీగల వెళ్లేవారు, అడ్డతీగల నుంచి రంపచోడవరం వైపు వెళ్లేవారు కొత్తపల్లి గోకవరం మీదగా రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కురిసిన వర్షానికి కూడా పైపులు కొట్టుకుపోయాయి.

ఎలక్ట్రిక్ బస్సులొచ్చేస్తున్నాయ్!

- మూడు నెలల్లో రోడ్లపైకి రాక..
- విశాఖకు తొలిదశలో 100, మలివిడత 100 బస్సులు
- సిటీ సర్వీసులుగానే నడిపేందుకు సన్నాహాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగర రోడ్లపై విద్యుత్ (ఎలక్ట్రిక్) బస్సులు పరుగులు పెట్టే రోజులు సమీపిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే తిరుపతి నుంచి కొండపైకి విద్యుత్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే నెల్లూరు-తిరుపతిల మధ్య ఇవి నడుస్తున్నాయి. రాష్ట్రంలోని మిగిలిన పెద్ద నగరాల్లోనూ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు కొన్నాళ్లుగా సన్నాహాలు జరుగుతున్నాయి. తొలిదశలో వెయ్యి విద్యుత్ బస్సులను కొనుగోలు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. విశాఖ నగరానికి 200 ఎలక్ట్రిక్ బస్సులు అవసరమవుతాయని ఆర్టీసీ జిల్లా అధికారులు యాజమాన్యానికి ఇదివరకే ప్రతిపాదనలు పంపారు. ఈ-బస్సుల కొనుగోలు మొదలవుతున్న నేపథ్యంలో.. మరో మూడు నెలల్లో వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని తాజాగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమే కాదు.. త్వరలోనే కార్యనిర్వాహక రాజధానిగా మారబోతున్న విశాఖకు తొలివిడతలో వీటిలో కనీసం వంద బస్సులనైనా కేటాయిస్తారని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి. మలిదశలో మరో వంద విద్యుత్ బస్సులను ఇస్తారని ఆశాభావంతో ఉన్నాయి.

సిటీ సర్వీసులుగానే..

విశాఖకు కేటాయించే ఎలక్ట్రిక్ బస్సులను తొలుత సిటీ సర్వీసులుగానే నడపనున్నారు. బ్యాటరీతో నడిచే ఈ-బస్సులు గతంలో 150 కిలోమీటర్లు తిరగడానికి మాత్రమే చార్జింగ్ సరిపోయేది. క్రమంగా వీటిలో సాంకేతికతకను అభివృద్ధి చేస్తుండడంతో ఇప్పుడు వాటి మైలేజి మరింత పెరిగే అవకాశం ఉంది. నగర పరిధిలో ప్రస్తుతం సిటీ బస్సులు రోజుకు 250 నుంచి గరిష్ఠంగా 400 కిలోమీటర్ల వరకు తిరుగుతున్నాయి. తొలుత వచ్చే విద్యుత్ బస్సులను తక్కువ కిలోమీటర్ల రూటుల్లో తిప్పాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మలి విడతలో రానున్న ఎలక్ట్రిక్ బస్సులను అప్పటి పరిస్థితులకనుగుణంగా వివిధ సిటీ రూట్లలో నడపనున్నారు. కొన్నాళ్ల తర్వాత సమీపంలోని పట్టణాలకు రెగ్యులర్ సర్వీసులుగా నడపాలని వీరు భావిస్తున్నారు.



సింహపురి, గాజువాక డిపోలు ఎంపిక

విద్యుత్ బస్సుల కోసం నగర పరిధిలోని సింహపురి, గాజువాక, వాల్తేరు డిపోలను తొలుత సిఫార్సు చేశారు. చివరకు వీటిలో సింహపురి, గాజువాకలను దాదాపు ఖరారు చేశారు. ఈ డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమయ్యే చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తారు. విశాఖలో ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం సింహపురి లేఅవుట్‌లో డిపోతో పాటు గ్యారేజీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

డీజిల్ బస్సుల స్థానంలో ఈ-బస్సులు

విశాఖ నగర పరిధిలోని ఏడు డిపోల్లో ప్రస్తుతం 525 సిటీ బస్సులున్నాయి. వాహనాల తుక్కు విధానంలో భాగంగా 15 ఏళ్లు దాటిన బస్సులను సేవల నుంచి తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా ఈ-బస్సులను సమకూరుస్తారు. విశాఖ జిల్లా ప్రజా రవాణా విభాగంలో ఈ సంవత్సరం 35 ఆర్టీసీ సిటీ బస్సులను తొలగించారు. వచ్చే ఏడాది ఆఖరు నాటికి మరో 150 వరకు సిటీ బస్సులు 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకోనుండడంతో వీటిని కూడా సేవల నుంచి తప్పించనున్నారు. విశాఖకు కేటాయించే ఎలక్ట్రిక్ బస్సులను తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా భర్తీ చేస్తామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. డీజిల్ బస్సులు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. భవిష్యత్తులో డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తే నగరంలో కొంతవరకు కాలుష్య నియంత్రణకు వీలు పడుతుందని తెలిపారు.

బీటీరోడ్డు నాణ్యత తనిఖీ

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు ప్రధాన రహదారి నుంచి తోటకూరపాలెం, బూరుగువాడ, కణతలబంద, దబ్బమామిడి గ్రామాల మీదుగా బండిగడ్డ గ్రామ ప్రధాన రహదారిని కలుపుతూ సుమారు రూ.5 కోట్లతో నిర్మిస్తున్న బీటీరోడ్డు నాణ్యతను గిరిజన సంక్షేమశాఖ డీఈఈ నాగరాజు బుధవారం తనిఖీ చేశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సైటు ఇంజినీరుకు సూచించారు. ఈ తనిఖీల్లో ఏఈ సత్యనారాయణ, సచివాలయ ఇంజినీరింగు అసిస్టెంటు శ్రీనివాసుదొర పాల్గొన్నారు.



బీటీ రోడ్డును నాణ్యతను తనిఖీ చేస్తున్న డీఈఈ నాగరాజు

రేపు జాబ్‌మేళా


కంచరపాలెం(విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 13వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. హనీ గ్రూప్, ఫ్లిప్‌కార్ట్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్, వరుణ్ మోటార్స్, హెటిరో ల్యాబ్స్, జయభేరి ఆటోమోటివ్స్, గేమ్స్ సాఫ్ట్, రక్షిత్ బిజినెస్ సర్వీసెస్, ఎంఏఎస్ మెరైన్ సర్వీసెస్, ఆస్ట్రోటెక్ స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 416 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. రిలేషన్‌షిప్ మేనేజర్, సేల్స్ మేనేజర్, డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ ఆఫీసర్, టెలికాలర్స్, పోర్ట్ సర్వేయర్స్, మెషీన్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, బీ, డీ.ఎం ఫార్మసీలో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని పేర్కొన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.28,000ల వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

'స్పందన' ఫిర్యాదుపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న మండల అధికారులు

సీలేరు: గంజాయి వ్యాపారంలో పాత్ర ఉందని సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపు గ్రామానికి చెందిన కొర్రా జగ్గారావు అనే వ్యక్తిని అన్యాయంగా అరెస్టు చేసి జైలుకు పంపించారని ఆ గ్రామస్థులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఐటీడీఏ పీవో విచారణకు ఆదేశించారు. దీంతో బుధవారం ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు,ఈవోపీఆర్‌డీ పాపారావు విచారణ జరిపి, గ్రామస్థుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఇద్దరు సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఈ సందర్భంగా పలువురు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ విచారణ నివేదికనుపీవోకు అందజేస్తామని చెప్పారు. సచివాలయ సిబ్బంది తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని, లేకపోతే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు చెప్పారు. ఈ విచారణలోఎంపీటీసీ పి.సాంబమూర్తి, సర్పంచ్ దుర్గో, ఉప సర్పంచ్ వల్లీ ప్రసాద్, సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోర్టు పెన్షనర్లకు పెరిగిన డీఏ

మల్కాపురం: హార్బర్ అండ్ పోర్టు పింఛనర్లకు డీఏ పెరిగినట్టు పింఛనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. అక్టోబరు నుంచి డిసెంబరు నెల వరకు క్లాస్ 1,2 ఉద్యోగులకు, పింఛనర్లకు 4.5 శాతం, క్లాస్ 3,4 ఉద్యోగులకు 4 శాతం డీఏ పెరిగినట్టు పేర్కొన్నారు. పెరిగిన కరువుభత్యం ఈ నెల పెన్షన్‌తో కలిసి వస్తుందన్నారు. వేజ్ రివిజన్ సమావేశం నవంబర్ 6న న్యూఢిల్లీలో జరుగుతుందని తెలిపారు.

ఐపీఆర్ మూక్స్ కోర్సులకు 3,500 దరఖాస్తులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ - ఐపీఆర్ చెయిర్ సెంటర్ ఫర్ ఐపీఆర్ ప్రారంభించిన మేసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు (మూక్స్)లకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఏయూలో చదువుతున్న పీజీ విద్యార్థులు 3,500 మందికి పైగా దరఖాస్తు చేశారు. ఏయూతోపాటు, అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. బుధవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి స్వయంగా కోర్సును విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏయూ ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ కోర్సులో భాగంగా రికార్డెడ్, వీడియో కంటెంట్ ఉంటుందన్నారు. మొత్తం 12 యూనిట్లలో మేధో హక్కులకు సంబంధించిన అంశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి రెండు క్రెడిట్‌లు, ఇ సర్టిఫికెట్ అందిస్తారు. కోర్సులో చేరడానికి ఆసక్తి కలిగినవారు 9599229217, 8333933425లో సంప్రదించాలి.



కోర్సు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

జలాశయాల్లో మత్స్య సంపద అభివృద్ధికి ప్రాధాన్యం

అడ్డతీగల: జలాశయాల్లో మత్స్య సంపద అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మత్స్యశాఖ రంపచోడవరం డివిజన్ అభివృద్ధి అధికారి సీహెచ్.రమేష్ చెప్పారు. స్థానిక మద్దిగడ్డ జలాశయంలో బుధవారం మత్స్యకార సహకార సంఘం సభ్యులతో కలిసి 16 వేల చేప పిల్లలను విడిచిపెట్టారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద వీటిని 40 శాతం రాయితీపై మత్స్యకారులకు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకులు డి.శివసాయి,మల్లవరం మామిళ్ళ గిరిజన మత్స్యకార సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మద్దిగడ్డ జలాశయంలో చేప పిల్లలను విడిచిపెడుతున్న మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రమేష్

రేపటి నుంచి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్

విశాఖ స్పోర్ట్స్: విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో 34వ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. అండర్ 14, 17, 19 కేటగిరిల్లో జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో బాలురు 23, బాలికలు 19 జట్లు పోటీపడనున్నాయి. ఈ సందర్భంగా బీవీకే కళాశాలలో బుధవారం జరిగిన సమావేశంలో కళాశాల చైర్మన్ పిఎస్ అవధాని మాట్లాడుతూ ఏయూ మైదానం, చంద్రంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, సీతమ్మధార శ్రీప్రకాష్‌స్కూల్, పోలీస్ బారెక్స్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లకు బీవీకే, కృష్ణ విద్యామందిర్‌లో వసతి కల్పిస్తున్నామన్నారు. పోటీలు ఏయూలో రాజ్యసభ సభ్యుడు జీ.వి.ఎల్.నరసింహారావు ప్రారంభించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చాంపియన్‌షిప్ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన చిన్నారి



గాయపడిన వరలక్ష్మి

గంగవరం: మండల కేంద్రం గంగవరం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఆముదాల బందగ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ మడకం వరలక్ష్మి తన కుమారుడు రేవంత్, సోదరుడు కుంజ రవీంద్రతో కలసి బైక్‌పై అడ్డతీగల నుంచి తిరిగివస్తూ గంగవరం సమీపంలో బైక్ ఆపారు. వీరిని వెనుక వైపు నుంచి వచ్చిన కాంక్రీట్ లారీ బలంగా ఢీ కొంది. దీంతో మడకం వరలక్ష్మి, ఆమె నాలుగేళ్ల కుమారుడు రేవంత్ తీవ్రంగా గాయపడారు. క్షతగాత్రులను స్థానికులు గంగవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి, అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైకు ఢీ.. ఒకరికి గాయాలు

కోటవురట్ల: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, బైకు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న కూనిశెట్టి రాజు కాలు విరిగిపోయింది. వెంటనే అతనిని 108లో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు మధ్యలో కారు ముందు భాగం దెబ్బతిని, టైర్ పంక్చర్ కావడంతో ఇరుపక్కల ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ సహాయంతో కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో హై అలర్ట్

- రెండు రోజులుగా ప్రత్యేక తనిఖీలు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆర్‌పీఎఫ్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు సంయుక్తంగా రెండు రోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికుల సామగ్రి, బ్యాగులు తనిఖీ చేస్తున్నారు. అయితే ఈ తనిఖీలు ఎందుకు చేస్తున్నారో అర్థం కాక ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. రైల్వే అధికారులు మాక్ డ్రిల్‌లో భాగంగా తనిఖీలు చేపట్టారని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. సాగర్ కౌచ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నామని ఆర్‌పీఎఫ్ పోలీసులు చెబుతున్నారు. విద్రోహ శక్తులు ఎవరైనా స్టేషన్‌లోకి చొరబడుతున్నారా..?, వారు ఏవిధంగా వస్తున్నారన్న దానిపై స్టేషన్‌కు అన్నివైపులా పహారా కాశారు. ఈ తనఖీలు గురువారం కూడా చేపట్టనున్నారు.



సింహాచలం ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు